www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025



నేడు బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం జరుగుతోంది. ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సమావేశం జరగనుందని కన్వీనర్ కుప్పల గిరిధర్ కుమార్ తెలిపారు. అన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు కలిసి చర్చించనున్నారు. తిరుపతి రైల్వే అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడి ఉంది. బాలాజీ రైల్వే డివిజన్ సాధించుకుంటే ఉమ్మడి చిత్తూరుజిల్లావాసులకు ఉద్యోగ అవకాశాలతో పాటు పలు రైళ్లు తిరుపతి మీదుగా నడిచే అవకాశం ఉంది. డివిజన్ ఏర్పడితే బడ్జెట్‌లో నిధులు రావడమే కాకుండా కొత్త రైళ్లతో పాటు అనేక ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

హోంమంత్రి అనితను సత్కరిస్తున్న ఎంఎల్ఎలు



సంఘీభావ సమావేశంలో హోంమంత్రి

దళిత పదవులన్నీ అంబేద్కర్ భిక్షే..!

ప్రజాశక్తి - వెదురుకుప్పం

'దేవళంపేట ఘటన డ్రామాలా జరిగింది.. వైసిపి వాళ్లు ఎంత కుట్ర చేశారు.. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కరుణాకర్‌రెడ్డిలు నిజాలు తెలుసుకుని రోడ్డుపైకి రావాలి.. అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మించడంలో ఎంఎల్ఎ కృషి అభినందనీయం. రెండు గంటల్లోనే చిత్తూరు ఎస్పీ కేసును ఛేదించాడు' అని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. తాను ఈ రోజు రాష్ట్రానికి హోంశాఖ మంత్రి అయ్యానంటే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పెట్టిన భిక్షేనని అన్నారు. తనతో పాటు దళిత ఎంఎల్ఎలకు పదవులు రావడానికి ఆయన రాజ్యాంగంలో రాసిన రాతలేనని అన్నారు. అటువంటి మహానుభావుని విగ్రహాన్ని ఓ దళిత సర్పంచి గోవిందయ్య చేత నిప్పు పెట్టించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో సంఘీభావ సమావేశాన్ని శనివారం తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేశారు. స్థానిక ఎంఎల్ఎ వి.ఎం థామస్ ఆధ్వర్యంలో జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన చోటే, తిరిగి వేరే విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించిన విషయం విదితమే. రాష్ట్ర హోంమంత్రి ఎంఎల్ఎలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ పదాన్ని ఉపయోగించి వైసిపి వాళ్లు రాజకీయం చేశారన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో, నిందితులను పట్టుకోవడంలో ఎస్పీ కృషి అభినందనీయమన్నారు. కొత్తగా చిత్తూరు జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయినా, రెండు గంటల్లోనే కేసును ఛేదించడం గొప్ప విషయమన్నారు. వైసిపి నాయకులంతా కలిసి టిడిపి నాయకుడు సతీష్‌రెడ్డిని అరెస్టు చేయాలని ధర్నా చేశారని, ఆ రోజంతా ఓ డ్రామాలా సాగించారన్నారు. వైసిపికి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి రోడ్డుపైకి వచ్చి దుండగులను పట్టుకోవాలని నిరసనలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. నారాయణస్వామికి వయస్సు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదన్నారు. గంగాధరనెల్లూరు ఎంఎల్ఎ డాక్టర్ వి.ఎం థామస్ మాట్లాడుతూ లిక్కర్ మాజీ మంత్రి నారాయణస్వామి చేసిన డ్రామా అన్నారు. ఒక విగ్రహానికి నిప్పు పెడితే వెయ్యి విగ్రహాలను నిలబెడతామన్నారు. తన అనుచరుడు స్థానిక సర్పంచి గోవిందయ్య చేత నిప్పు పెట్టించారన్నారు. నారాయణస్వామి హయాంలో దళితులను గంజాయి, సారా మత్తులో ముంచి, వ్యవస్థను నాశనం చేశారన్నారు. ఆయన రాజకీయ స్వార్థం కోసం గతంలో ఆయన సొంత ఊరైన పాదిరకుప్పం దళిత గ్రామానికి నిప్పుపెట్టించడంతో చాలా మంది చనిపోయారని గుర్తు చేశారు. టిటిడి బోర్డు సభ్యులు, అనంతపురం ఎంఎల్ఎ ఎంఎస్ రాజు మాట్లాడుతూ నారాయణస్వామి డ్రామాలో గోవిందయ్య బలిపశువు అయ్యాడన్నారు. పూతలపట్టు ఎంఎల్ఎ మురళి మాట్లాడుతూ దేశానికి ఒక వ్యవస్థను సృష్టించి, అందులో మనం ఏవిధంగా జీవనం సాగించాలి, మన హక్కుల గురించి దిశానిర్దేశం చేసిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, సత్యవేడు ఎంఎల్ఎ ఆదిమూలం, వేపంజేరి మాజీ ఎంఎల్ఎ ఆర్ గాంధీ, ఎంఆర్‌సి బాబు, ఎంపిడిఒ పురుషోత్తం, వెదురు అధికారి పరశురాం రెడ్డి, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయ యాదవ్, వెదురుకుప్పం మండల అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళి, చెంగల్‌రాయల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్లూ రంగు పసుపయ్యింది.. అంతేగా..!

సిబిఐ విచారణ జరపాలి : నారాయణస్వామి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహం అగ్ని ప్రమాద వివాద ఘటనపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో నిజాలు నిగ్గుతేల్చడానికి సిబిఐ ఎంక్వైరీ వేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవళంపేట ఘటనపై స్పందించిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రంలోని పిఠాపురం, నెల్లూరు వివిధ ప్రాంతాలలో ఎస్సీలపై జరిగిన దాడిలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ఒక తల్లి బిడ్డల్లా ఉన్న మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టారని, ఒక ఎస్సీ సామాజిక వర్గంపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతుంటే అదే సామాజిక వర్గానికి చెందిన హెూంమంత్రి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ నోటికొచ్చినట్టు మాట్లాడటం సబబు కాదని, అంబేద్కర్ అగ్ని ప్రమాద వివాద ఘటనను జగన్మోహన్ రెడ్డికి ఆపాదించాలని మాట్లాడడం హేయమైన చర్యగా పరిగణిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆరే అజయ్ కుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.





రేపటినుంచి పుత్తూరులో సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

సిఐటియు తిరుపతి జిల్లా మహాసభలు అక్టోబర్ 13, 14 తేదీల్లో పుత్తూరు బిఎస్ఎన్ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు జరగనున్నాయని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. పుత్తూరులోని కల్యాణ మండపంలో ముఖ్య శ్రేణులతో సమావేశం శనివారం జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడాన్ని తప్పుబట్టారు. గత 13 ఏళ్లుగా కార్మికులకు కనీస వేతనాలను నిర్ణయించడంలో తీవ్రమైన జాప్యం జరిగిందని, ధరలు పెరుగుతున్నంత వేగంగా కార్మికుల జీవన స్థితిగతులు మెరుగు పడకపోవడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని, చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆఖరుకు ప్రభుత్వ పథకాలకు అర్హులు కాలేదన్నారు. దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను ఒక్క కలం పోటుతో రద్దు చేసి, లేబర్‌కోడ్‌లుగా మార్చేసిందన్నారు. అదేతీరును చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిందని, ఈ తప్పుడు విధానాలను అవకాశవాదంతో వైసిపి కూడా సమర్థిస్తోందన్నారు. డిసెంబర్ 31 నుంచి విశాఖలో అఖిల భారత మహాసభలు ఐదు రోజుల పాటు జరగనున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, మునిరాజ, ఆర్.వెంకటేష్, భాస్కర్, విజయ్, అంగన్‌వాడి నాయకులు మునికుమారి, వినయ్‌కుమారి, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ పాల్గొన్నారు.

రుయాలో కాంట్రాక్టు కార్మికుల రిలే నిరసన దీక్ష


ప్రజాశక్తి - తిరుపతి టౌన్



రుయాలో దాదాపు ఇరవై ఏళ్ల పైబడి పేనిచేస్తున్న కార్మికులను కొత్తగా కాంట్రాక్టు తీసుకున్న పద్మావతి కంపెనీ కాంట్రాక్టర్ భాస్కర్‌నాయుడు టెండర్ తీసుకుని, ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అర్ధాంతరంగా పనిలోనుంచి నిలిపేశారని, వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.సుబ్రమణ్యం, నగర అధ్యక్ష కార్యదర్శులు పి.బుజ్జి, ఎం.మాధవ్, యూనియన్ గౌరవాధ్యక్షులు కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో రుయా ప్రాంగణంలో రిలే నిరసన దీక్షలు ప్రారంభించారు. రుయా ఆస్పత్రి రాయలసీమలోనే తలమానికమని, 1260 బెడ్లకు దాదాపు 600 మంది పైచిలుకు కార్మికులు అవసరం ఉంటే, కేవలం రెండు మూడు వందల మందితో పనిచేసే పరిస్థితి ఉందన్నారు. కొత్తగా కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలొడ్డి కార్మికులు పనిచేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచితే, 50 ఏళ్లు దాటితే పని చేయకూడదని ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. తొలగించిన కార్మికులను వెంటనే పనుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.ప్రభాకర్, లక్ష్మమ్మ, బి.రాణి, వై.లక్ష్మమ్మ, ఎస్‌బిబి, పి.సుబ్రమణ్యం, పి.రామ్మూర్తి, కె.సుబ్రమణ్యం, పి.లక్ష్మీదేవి, కె.లక్ష్మి పాల్గొన్నారు.

'సిఎంఆర్ ఎకో' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏర్పేడు



ఏర్పేడు మండలం రాజులపాలెం సమీపంలో ఉన్న సిఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమలో వరుస ఫైర్ యాక్సిడెంట్లు జరుగుతున్నాయని సిఐటియు మండల కార్యదర్శి రాంబాబు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం షిఫ్ట్ ముగింపు సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలోనూ, గతంలో గ్యాస్ లీకైన సందర్భంగానూ మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వరుస ప్రమాదాలు జరగడంతో కార్మికులకు భద్రత కరువయ్యిందన్నారు. సిఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. శనివారం పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిన చోటును పరిశీలించి, ప్రమాదం సంభవించిన తీరు, కారణాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని, అస్వస్థతకు గురైన కార్మికులకు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు షేక్ కరీముల్లా, రైతుసంఘం నాయకులు రంగయ్య, వెంకటాద్రి, సిపిఎం ఏరియా కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.

కుప్పంలో రూ.219 కోట్లతో శ్రీజ పరిశ్రమ
వర్చువల్‌గా ప్రధాని మోడీ శంకుస్థాపన


ప్రజాశక్తి-కుప్పం



కుప్పం నియోజకవర్గ పరిధిలోని గుడిపల్లి మండలం పొగురుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీజ మహిళా పాల ఉత్పత్తి సంస్థ యొక్క ఇంటిగ్రేటెడ్ డెయిరీ పశువుల దాణా ప్లాంట్ ఏర్పాటుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు 45 ఎకరాల స్థలంలో రూ. 219 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పరిశ్రమకు ప్రధాని శంకుస్థాపన చేయగా కుప్పం కడ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, మహిళలు, టిడిపి నేతలు, అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. దేశంలో పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ శనివారం పలు రాష్ట్రాలలో కొత్త డెయిరీ ప్రాజెక్టుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా పొగురుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీజ పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శ్రీజ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఎం ఓ యు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కడ పిడి వికాస్ మరమ్మత్, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, జనసేన నేత నరేష్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సుగుణమ్మ పాల్గొన్నారు.

గడగొట్టు సాంబశివరావుకు కెవిచౌదరి అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఎయిర్ కార్గో ఫోరం ఇండియా ఎపి చాప్టర్‌గా డాక్టర్ గడగొట్టు సాంబశివరావు ఎన్నికయ్యారు. ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి ఆయనకు అభినందనలు తెలిపారు. డాక్టర్ గడగొట్టు సాంబశివరావు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షులుగా వ్యవహరించారు.ఏపీలో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతిలో నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయి. ఎగుమతి, దిగుమతి కార్గో కార్యకలాపాలకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఫార్మా ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, పువ్వులు, మొక్కలు, పరిశ్రమలు, నౌకాస్పేర్స్ వంటి వస్తువుల ఎగుమతికి, బంగారం, వెండి, వజ్రాలు వంటి వస్తువుల దిగుమతికి విస్తృత అవకాశాలు ఉన్నాయి.



ఓఆర్ఐని పరిశీలించిన ఎస్వీయూ వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు బాధ్యతలు చేపట్టిన వెంటనే సాయంత్రం విశ్వవిద్యాలయంలోని ప్రతిష్ఠాత్మకమైన ప్రాచీన తాళపత్ర గ్రంథాలయాన్ని (ఓఆర్ఐ) సందర్శించారు. తాను వెబ్సైటులో చూసిన తాళపత్ర గ్రంథాలను నేరుగా చూసి ఆశ్చర్యపోయారు. సంస్థ సంచాలకులు ఆచార్య పి సి వెంకటేశ్వర్లును అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరిరక్షణకు తీసుకుంటున్న శాస్త్రీయ విధానాలను చూసి అభినందించారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రాచీన సాహిత్యం భద్రంగా యస్వీయూ సంరక్షించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, చంద్రశేఖర్, వెంకటేష్, సిద్దయ్య, బాషా, నాగరాజు,శోభన్ బాబు,విశ్వనాథ్ రెడ్డి, పరిశోధకులు సంతోష్, సోమలింగడు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

'అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్'పై వర్కుషాపు

ప్రజాశక్తి - తిరుపతి సిటీవైద్యసేవలు అందించడంలో భాగంగా మందులు రాస్తారని, ప్రతి మందు ఎలా మావన ప్రాణాన్ని కాపాడుతుందో, అలాటే వాటివల్ల కొన్ని అనర్థాలు ఉంటాయని, మందుల వాడకంతో వచ్చే దుష్ప్రభావాలను అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ అంటారని స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్‌సచన్ అన్నారు. స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం, భారత ప్రభుత్వం ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ (ఐపిసి) సంయుక్త ఆధ్వర్యంలో వర్కుషాపు శనివారం జరిగింది. ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2016 నుంచి తాము ఈ వర్కుషాపును నిర్వహిస్తున్నామని, గత ఎనిమిది సంవత్సరాలుగా తాము 20 నుంచి 24 గ్రామాలకు వెళ్లి డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి దాదాపు 80వేల మందికి మందులు సరైన విధంగా వాడటం గురించి అవగాహన కల్పించామన్నారు.

టాస్క్‌ఫోర్స్ చరిత్రలో రికార్డు
10 టన్నుల ఎర్రచందనం స్వాధీనం
ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ దేశ రాజధాని ఢిల్లీకి తరలించి అటు నుండి విదేశాలకు ఎగుమతి చేస్తున్న స్మగ్లర్ల కుట్రను పసిగట్టిన ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక కార్యదళం (టాస్క్ ఫోర్స్) ప్రత్యేక వ్యూహంతో టాస్క్ ఫోర్స్ హెడ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో బందాలుగా ఢిల్లీ వెళ్లి రూ.8 కోట్ల రూపాయలు విలువ చేసే 9576 కిలోల బరువు గల 356 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. అటవీశాఖ, నిఘా విభాగం సహకారంతో టాస్క్ ఫోర్సు విజయవంతంగా ఎంతో క్లిష్టమైన ఈ ఆపరేషన్ ను నిర్వహించి విలువైన ఎర్రచందనం ఎల్లలు దాటకుండా నిలువరించగలిగారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్దగల టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి అటవీ శాఖ సర్కిల్ సిసిఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి పవన్ కుమార్ రావు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ ఈస్ట్ ఢిల్లీ తుగ్లకాబాద్ ప్రాంతంలో ఢిల్లీ పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్న 356 ఎర్రచందనం దుంగలను, అంతర్రాష్ట్ర స్మగ్లర్లు హైదరాబాద్ హాకీంపేట్ ప్రాంతానికి చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్, మహారాష్ట్రకు చెందిన అమిత్ సంపత్ పవార్ ల అరెస్టును మీడియాకు చూపారు. ఢిల్లీకి వెళ్లి ప్రత్యేక ఆపరేషన్ ను పకడ్బందీగా అమలు చేసి భారీ స్థాయిలో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడానికి ఎంతో సాహసోపేతమైన సేవలు అందించిన టాస్క్ ఫోర్స్ పోలీసుల బందానికి ఎస్పి రివార్డులు అందించారు.

భారీగా ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కేవీబీపురం, ఏర్పేడు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతమైన సదాశివపురం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో భారీగా ఎర్రచందనం దుంగలను శ్రీకాళహస్తి అటవీశాఖాధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. సుమారు రూ. 11 లక్షల విలువ జేసే 435 కిలోల బరువున్న 51 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం శ్రీకాళహస్తి అటవీశాఖాధికారి లోకేష్ మీడియా ముఖంగా వెల్లడించారు. సదాశివపాలకోన ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారని గోప్య సమాచారం అందడంతో తిరుపతి టాస్క్ ఫోర్స్, శ్రీకాళహస్తి అటవీ శాఖ సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసినట్లు వివరించారు. దాడుల సంగతి ముందుగానే పసిగట్టిన స్మగ్లర్లు ఎర్రచందనం దొంగలను అడవిలోనే వదిలిపెట్టి పారిపోయినట్లు పేర్కొన్నారు. స్మగ్లర్లకు గూఢ చర్యం చేస్తున్న పలువురు గ్రామస్తులను విచారించనున్నామనీ, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పరిసర అడవుల్లో ఎర్రచందనం సంపద అధికంగా ఉందనీ వాటిని సంరక్షించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అడవుల్లో బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి నిఘా పెంచుతున్నామని తెలిపారు.





క్రమశిక్షణతో ఉన్నతశిఖరాలకు : ఎఎస్‌పి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కళాశాలలో క్రమశిక్షణతో నేర్చుకునే విద్య వారిని ఉన్నత శిఖరాలకు చేరవేసి సమాజంలో తలెత్తుకుని బతికేలా శక్తి సామర్థ్యాలను ఇస్తుందని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ను పరిచయ్ 2025 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్తు కోసం కష్టించి కళాశాల విద్యకు పంపుతారని, ఇదే సమయంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులను కాకుండా వారి ఆశయాలను గుర్తించుకొని విద్యను అభ్యసించాలన్నారు. శ్రీరామ కళాశాల విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యం చేరుకొని తిరిగి ఇదే కళాశాలలో నిర్వహించే కార్యక్రమానికి అతిథిగా వచ్చినప్పుడు తాను చాలా సంతోషపడతానన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పి రవిమనోహరాఆచారి మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి, ఉన్నత లక్ష్యాలు చేరుకుని ఆర్థికంగా ఎదిగి సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. నేడున్న టెక్నాలజీ ప్రపంచంలో సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తమై వారి తల్లిదండ్రులను జాగతి చేయాలన్నారు. ఎంతో విలువైన భవిష్యత్తును చెడు వ్యసనాలకు, అక్రమ పద్ధతిలో డబ్బులు సంపాదించడానికి వినియోగించొద్దన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల పట్ల ప్రత్యక్ష స్వీయ పరిశీలన చేస్తున్నామని, వారి భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన అన్ని సదుపాయాలను కళాశాలలో ఏర్పాటు చేసామన్నారు. రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వాసు పాల్గొన్నారు.

'జిఎస్‌టి' తగ్గిందా...ప్రచారార్భాటమేనా..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్టీ). ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి, మత విద్వేషాలకు ఆజ్యం పోస్తున్న మోడీ ప్రభుత్వం, ప్రచార ఆర్భాటాల్లో మాత్రం పైచేయి సాధిస్తోంది. పేద మధ్యతరగతి ప్రజలను దష్టిలో ఉంచుకొని జీఎస్టీ స్లాబ్లు మార్పు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గిన పాపాన పోలేదు. పైగా తమ గొప్పలు చెప్పుకునేందుకు ప్రచార ఆర్భాటానికి దిగింది. ఇందుకయ్యే ఖర్చులూ పరోక్షంగా ప్రజలపై భారాలు మోపనుండడం గమనార్హం.

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అన్నది భారతదేశంలో అనేక విడివిడి పన్నులను ఒకే పన్నులో విలీనం చేసేలా వచ్చిన పన్నుల వ్యవస్థ. దాన్ని 101వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద రాజ్యాంగ చట్టం 2016గా ప్రవేశపెట్టారు. జీఎస్టీ కౌన్సిల్ ఛైర్మన్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వస్తు సేవల పన్నును పరిపాలిస్తారు. జీఎస్టీ అన్నది భారతదేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నుల బదులు వస్తువులు, సేవల తయారీ, అమ్మకం, వినియోగాలపై విధించనున్న సమగ్రమైన పరోక్ష పన్ను. వాస్తవానికి అన్ని రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను తమ గుప్పట్లో పెట్టుకోవడానికి ఇదో మార్గం అన్నది అనతి కాలంలోనే అందరికీ అవగాహతమైంది. జీఎస్టీ పన్ను విధానం ఐదు స్లాబులుగా 5, 12, 18, 28, 40శాతం విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని కొంత మార్పు చేసి, సామాన్యులకు మరింత మేలు చేకూర్చాలని కొత్త స్లాబులను ఆగస్టులో ప్రకటించారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రూపేనా కేంద్ర ప్రభుత్వానికి 22 లక్షల కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. కేంద్ర ప్రభుత్వాలకు వచ్చే ఆదాయంలో ప్రతి ఏడాది 40 నుంచి 60 వేల కోట్ల రూపాయలు పన్నులు తగ్గించుకుని, దాని ప్రతిఫలంగా ప్రజలు వినియోగిస్తున్న ఉత్పత్తుల ధరలు తగ్గిస్తూ వాళ్లకి మేలు చేకూరుస్తామని వెల్లడించారు. గతంలో ఉన్న 12, 28 స్లాబులను తీసేసి, సుమారు 147 వస్తువులను జీరో స్లాబ్ లోకి తీసుకొస్తున్నామని, ఇందులో నిత్యవసర వస్తువులు సైతం ఉన్నాయని ప్రకటించారు. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి వాటిని అమలులోకి తీసుకొచ్చారు. కానీ ఎక్కడా ధరలు తగ్గిన పాపాన పోలేదు. ప్రతి ఒక్కరూ వినియోగించే వాటర్ బాటిల్ నుంచి, చిన్నారులకు అవసరమైన పాలు సైతం అదే ధరలు కొనసాగుతున్నాయి. పేదవారు మధ్యతరగతి సామాన్య ప్రజలు వినియోగించే వస్తువులు ఏది పైసా తగ్గకపోగా, ధనవంతులు, ఆర్థిక పరిపుష్టి గల వారు వినియోగించే లక్షల కోట్లు విలువ చేస్తే వస్తువులు ధరలు మాత్రం తగ్గుముఖం పట్టడం గమనార్హం. కేంద్రం తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైంది. దీన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రచార ఆర్భాటాలకు తెరలేపింది ఎన్డీఏ ప్రభుత్వం చేసిన జీఎస్టీ మార్పు చాలా మంచిదని అక్కడక్కడ అవగాహన సదస్సులు పెట్టి ప్రజలకు వివరించాలని ఆదేశించింది. ఇంకేముంది మోడీకి అత్యంత సన్నిహితులు, నమ్మిన బంటులైన కూటమి పెద్దలు ఆ భారాన్ని భుజానికి ఎత్తుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని విస్తత పరచడంలో ప్రధాన బాధ్యత తనది అనేలా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా తన సొంత జిల్లా అయిన తిరుపతి జిల్లాను ఇందుకు వేదికగా చేసుకున్నారు.

జీఎస్టీ విధానం చాలా మంచిదని ఇప్పుడు ఉన్న స్లాబ్లు ఎంతో ఉపయోగకరమని సాక్షాత్తు ప్రధానమంత్రి ద్వారా చెప్పించేందుకు రాయలసీమలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు రంగంలోకి దిగారు. ఆ సభకు ముందే తన సొంత జిల్లాలో జీఎస్టీ పై ప్రజలకు విస్తతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పుకునేందుకు, రకరకాల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ప్రవేటు వ్యక్తులు ఏ కార్యక్రమం చేసిన అందులో జిఎస్టి గురించి గొప్పలు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. అక్కడ ఇక్కడ ఏమి లేదు... ప్రైవేటు వైనా ప్రభుత్వ కార్యక్రమాలైనా ఇదే తంతు. మెడికల్ కాలేజీలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్నిటిలోను అవకాశం దొరికితే జిఎస్టి స్లాబుల మార్పు అద్భుతం, దీనివల్ల సామాన్యుడికి కోట్లాది రూపాయలు మేలు చేకూరుతుంది, ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన కలిగి, ధరలు తగ్గించని వ్యాపారులను నిలదీయండి అనేలా పిలుపును ఇస్తుండటం విడ్డూరం. పాలకులు తలుచుకుంటే తిమ్మిని బమ్మిని చేయగలరనే సామెత ఊరికే పుట్టిందా..! ప్రజలకు ఏమాత్రం మేలు చేకూర్చని జిఎస్టి స్లాబ్ లో మార్పు వల్ల అద్భుతాలు జరుగుతున్నాయని ప్రచారాలు చేయడం ప్రజల్ని విస్మయానికి గురిచేస్తుంది. ఇకనైనా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గే విధంగా చర్యలు తీసుకుని సామాన్యులకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తారని ఆశిద్దాం....!

ఊబకాయం ఆరోగ్యానికి ప్రమాదకరం: మొయినోద్దీన్‌జి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

నేడు చిన్న వయసులోనే ఊబకాయం సమస్యతో చాలామంది తమ ఆరోగ్యాలను ప్రమాదకర పరిస్థితులలోకి తీసుకెళుతున్నారని, దక్షిణాదిలోని ముఖ్యంగా బెంగళూరులో ఉన్న మణిపాల్ హాస్పిటల్ లో ఊబకాయ సమస్యకు బేరియాట్రిక్, మెటబాలిక్ సర్జరీ ద్వారా పరిష్కారం చూపుతున్నామని సర్జరీల విభాగం డైరెక్టర్ డాక్టర్ జి.మొయినోద్దీన్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎంబిబిఎస్ తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో చదివానని, ఎక్కువ భాగం తిరుపతి నుండి ఊబకాయ సమస్యతో తమకు కేసులు రావడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ అనారోగ్య సమస్యలకు మంచి వైద్య చికిత్సను మణిపాల్ హాస్పిటల్ లో అందిస్తున్నామని, ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీతో కూడిన యంత్రంతో లాప్రోస్కోపిక్ సర్జరీ, రోబోటిక్స్ తో సర్జరీలు చేస్తున్నామన్నారు. ఊబకాయ చికిత్సలను బిఎంఐ ఆధారంగా చేస్తామన్నారు. ఈ సర్జరీ ఇప్పుడు కేవలం 40 నిమిషాలలో పూర్తి చేస్తామని, రెండు రోజుల తర్వాత పేషంటును ఇంటికి పంపుతామన్నారు.జనసేన పార్టీ నాయకుడు బత్తెన మధుబాబు ఊబకాయ సమస్యతో తమ వద్దకు వచ్చి ఇప్పుడు సర్జరీ తర్వాత ఎంతో ఆరోగ్యకరంగా ఉన్నారన్నారు.



జన విజ్ఞాన వేదిక కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి - పాకాల: తిరుపతి జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప ఆధ్వర్యంలో పాకాల మండల శాఖ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొగరాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్దులు, గౌరవాధ్యక్షులుగా ఇండియన్ స్కూల్ అధినేత సాత్యకి, ఉపాధ్యక్షులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒడ్డేపల్లి పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాకాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు జయచంద్ర, సహాయ కార్యదర్శిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓబులశెట్టి వారి పల్లి గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణబాబు , కోశాధికారిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దామలచెరువు వ్యాయామ సంచాలకులు గణపతిని కార్యవర్గంగా ప్రకటించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రెడ్డప్ప మాట్లాడుతూ మండలంలో జనవిజ్ఞాన వేదికకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కార్యవర్గమంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మధు, లక్ష్మి, షాతాజ్ తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్ నియామకం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత మూడు నెలలుగా గైనకాలజిస్ట్ లేకపోవడంతో మహిళలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మెడికల్ ఆఫీసర్ డా. చంద్రశేఖర్ ఈ విషయం గురించి ఎమ్మెల్యే భాను ప్రకాశ్‌కు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే భాను ప్రకాష్ నగరి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్ డా. యుహెచ్. జరీనాను డిప్టేషన్‌పై పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. పుత్తూరు పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ సిబ్బంది తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించండి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, తిరుమద్యం, యనమలపాలెం రోడ్డు మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంగా ఉంది. రాత్రి వేళల్లో ఆటోలు, బైక్ లు, ట్రాక్టర్లు రావాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదం జరిగే అవకాశం కూడా ఉందని స్థానికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టి సారించి రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జిఎస్టీపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సూచనతో, పుత్తూరు రూరల్ గోపాలకృష్ణపురం పంచాయతీలో సూపర్ జిఎస్టీ సూపర్ సక్సెస్ ప్రచార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ పార్టీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు కుమార్, బూత్ కమిటీ అధ్యక్షుడు హరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిధిలావస్థలో పాఠశాల భవనం


పెచ్చులూడిన పైకప్పు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పివి కండ్రిగ పంచాయతీ, కృష్ణాపురం, గిరిజన కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు 30 సంవత్సరాల క్రితం ఆలత్తూరు పంచాయతీ పరిధిలో నిర్మించిన ఈ భవనంపైన పైపెచ్చులు ఊడి పిల్లలపై పడే ప్రమాదం పొంచిఉంది. ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడు, 15 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. రాబోయే వర్షాకాలంలో భవనం కూలిపోయే లేదా పెచ్చులు మరింత ఊరిపడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సర్పంచ్ యనమల కోటమ్మ పలుమార్లు ఎంఈఓ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని లేదా కొత్త భవనం నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగి సుబ్రహ్మణ్యంకు అవార్డు



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మ్యాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ దినేష్ ఆధ్వర్యంలో జానపద కవితలు, ఉత్తమ రచనలు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం ఉద్యోగి, గుండ్లూరు సుబ్రహ్మణ్యంకు సౌత్ ఇండియా బంగారు నంది అవార్డు 2025ను శనివారం ప్రధానం చేశారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళామందిరంలో ఈ అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంతటి విశిష్టత అవార్డును తెలంగాణ ప్రభుత్వ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మధుసూదనాచారి, వెన్నెల గద్దర్, తెలంగాణ ఉద్యమ వీరులచే అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఉద్యోగోన్నతిపై జిల్లాకు 10 మంది డిప్యూటీ ఎంపీడీవోల రాక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి జోన్-3, జోన్-4 లలో గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీ సెక్రటరీలు, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-1(విడిఓ గ్రేడ్-1), జిల్లా ప్రజా పరిషత్, మండల పరిషత్, డిఎల్పిఓ కార్యాలయాలలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తించే 10 మందికి అడహక్ పద్ధతిలో ఉద్యోగోన్నతి కల్పించి బదిలీలు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ మైలవరపు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో 14 డిప్యూటీ ఎంపీడీవోలకు ఖాళీలు ఉండగా అంతర్జిల్లాల బదిలీలలో భాగంగా బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుండి 10 మంది డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందారు. ఆర్.భూషణం(బాపట్ల జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), జి.కోటనాగయ్య(బాపట్ల జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), జి.సిహెచ్. కాశీనాయక్ (ప్రకాశం జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), ఎన్. దేవదానం (ప్రకాశం జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), ఎం.డి.సుల్తాన్ అజీజ్ (నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), జి.రవికుమార్(చిత్తూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), ఏ.గిరిధర్ (చిత్తూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), ఎన్.షణ్ముగరావు (చిత్తూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), టి.పి. షణ్ముగం (చిత్తూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు), ఎం. శంకర ప్రసాద్ (నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు) రానున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు వారికి పోస్టింగ్స్, రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో కమిషనర్ పేర్కొన్నారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలో వైసీపీ మండల కన్వీనర్ మణి నాయుడు, ఉప కన్వీనియర్ ప్రసాద్ర పాల్, పార్టీ శ్రేణులు శనివారం పెద్దిరెడ్డి 74వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకోతోటి రాజేష్, వీరేంద్ర రాజు, ఏలూరు రాకేష్, మండల కన్వీనర్ మణి నాయుడు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను, నారాయణ వనంలో వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పెద్దిరెడ్డి 74వ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం నారాయణవనం బైపాస్ జంక్షన్ వైయస్సార్ విగ్రహం వద్ద వైసీపీ ఉమ్మడి క్రియాశీలక కార్యదర్శి టి.రాకేష్ కిరణ్ పార్టీ శ్రేణులు, వైసీపీ రాష్ట్ర విభాగ వాణిజ్య కార్యదర్శి అన్నా దొరై, మండల ఎంపీపీ దివాకర్, మండల కన్వీనర్ సొరకాయలు కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పుత్తూరు, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పుత్తూరు వారి పరిధిలో బాలికలకు అవగాహన, వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఇంచార్జ్ సంధ్య మాట్లాడుతూ బాలికల హక్కులు, చదువుకోవాల్సిన ఆవశ్యకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, బాల్యవివాహాలతో అనర్థాలు వంటి విషయాలను విద్యార్థినులకు తెలియచేశారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుబ్బరత్న, పుత్తూరు ప్రాజెక్టు సూపర్వైజర్స్ గీతాంజలి, శ్రీదేవి, అనిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని లోకమాతాపురం, అంగనవాడి కేంద్రంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ సి పురం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ మనీలా మాట్లాడుతూ బాలికల విద్య, వైద్యసేవలు, పోషణ, రక్షణ వంటి హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వెంకట మునిమ్మ, రూప, వరలక్ష్మి, కావమ్మ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండల పరిధి లోని సాంబయ్యపాలెంలో నివసిస్తున్న ఆదిలక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధప డుతోంది. శనివారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి, బొజ్జల బృంద మ్మ ఆమెకు సీఎం సహాయ నిధి ద్వారా విడుదలైన 2,03,653 రూపాయల చెక్కును వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేయడం జరిగింది. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, జయ చంద్ర నాయుడు, కమల్ కుమార్, మల్లీశ్వరి, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

ప్రజాశక్తి -కోట : ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ద్వారా కోట మండలం తిమ్మనాయుడు పాలెంకు చెందిన జింకల బాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేసిన 42 వేల రూపాయలు అందజేశారు. బాధితుల కుటుంబాలకు టీడీపీ సీనియర్ నాయకులు మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా శనివారం చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్రి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 19 లక్షల 46 వేల 845 రూపాయలను చెక్కులను బాధితులకు ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రామిక్ నగర్ సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే పాశిం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని, శ్రామిక్ నగర్‌లో శనివారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పర్యటించారు. ఇటీవల అక్కడి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరడంతో ఆయన వారిని స్వయంగా కలిసి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువలు, రోడ్లు వంటి మౌలిక సౌకర్యాలు లేవని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రామిక్ నగర్ ప్రాంతం వివాదంలో ఉందని, ముందు అధికారులు స్థలాలు ఎవరివో సర్వే చేసి తేల్చాల్సిఉందన్నారు. ఇళ్ళ మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయాలని అదికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ ప్రసాద్, డిస్కం ఈఈ నరేంద్ర రెడ్డి, నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం, ఇజ్రాయేల్, సీపీఎం నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీలో ఎస్‌కెఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఎస్కేఆర్ ప్రభు త్వ డిగ్రీ కళాశాల, గూడూరు విద్యార్థినులు రన్నర్అప్ బహు మతి, విక్రమ సింహపురి విశ్వవి ద్యాలయం అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ టోర్నమెంట్, కావలి అంతర్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గూడూరు విద్యార్థినులు మునిలక్ష్మి , శ్రావణి అద్భుత ప్రతిభ కనబరిచి రన్నర్అప్ బహుమతిని సాధించారు. వారి కృషి, క్రీడా నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ రాజు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్, మునిలక్ష్మి, శ్రావణిని అభినందిస్తూ, క్రీడలతో పాటు విద్యలోనూ ఇలాగే రాణించాలని ఆకాంక్షించారు.

ఎస్వీయూ విసికి ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య తాత నర్సింగరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్లోబల్ లా కళాశాల చైర్మన్ డాక్టర్ రామసాని తిప్పారెడ్డి ఘనంగా సన్మానించారు. లా కళాశాల సిబ్బందితో కలిసి ఉపకులపతికి పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిజయ్ కుమార్ బెహర, సెక్రెటరీ లక్ష్మి వశస్త పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హాస్టల్ ఎన్.ఎం.ఆర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన వైస్ ఛాన్సలర్ ఆచార్య కాటా నర్సింగారావును పుష్పగుచ్చం అభినందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లా డుతూ వర్సిటీలో ఎన్నో సంవత్సరాలుగా హాస్టల్‌లో ఎంఎంఆర్‌లుగా పనిచేస్తున్నా మని తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని విసికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఏ.గిరిబాబు, ఉమెన్స్ ప్రెసిడెంట్ పి.గౌతమి, ప్రధాన కార్యదర్శి కె. లోకేష్, వైస్ ప్రెసిడెంట్ సి గౌరీ, ట్రెజరర్ సి.ధనంజయులు, జాయింట్ సెక్రటరీ ఎస్ ఎన్. అశోక్ కుమార్, ఇంటర్నల్ ప్రెసిడెంట్ వి. మునికృష్ణారెడ్డి, ఆర్గనైజ్ సెక్రెటరీ ఆర్. సురేష్, ఆడిటర్ సి. వెంకటరమణ, ఈ.సతీష్ కుమార్, కే.పరశురాం ప్రెస్ ప్రెసిడెంట్ ఎస్.మోహన్ బాడీ మెంబర్స్ పద్మావతి, చెంగమ్మ వాణి, తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : డప్పు కళాకారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ప్రాచీన కళ అయిన డప్పు పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వెంకటయ్య వాపోయారు. వయోపరిమితి తగ్గింపు, పెన్షన్లు, యూనీఫామ్, గుర్తింపు కార్డులు, డప్పు పరికరాల మంజూరులో ఏళ్ల తరబడి మీనమేషాలు లెక్కిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వంలో కదలిక రాకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, సహాయ కార్యదర్శి అరుణాచలం, రఘు, సురేష్, అక్బర్ బాషా, వెంకటముని, గురవయ్య, గోవిందస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ఏనుగులు హల్‌చల్

ప్రజాశక్తి - చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం యల్లంపల్లి పరిధిలోని మూలపల్లిలో శుక్రవారం రాత్రి ఏడు ఏనుగుల గుంపు గ్రామంలోకి దూసుకొచ్చి వరి, అరటి పంటలను ధ్వంసం చేశాయి. గత కొద్ది రోజులుగా పులిచెర్ల మండలంలో ఏనుగులు అక్కడే తిష్ట వేసి సంచరిస్తూ పంట పొలాలను ధ్వంసం చేస్తూ మూలపల్లికి చేరాయి. ఏనుగులు ఘీంకారాలతో గ్రామస్తులు భయాందోళనకు గురై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఏనుగులను అడవిలోకి తరలించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. శనివారం రాత్రికి కందులవారిపల్లి, నారావారిపల్లి, నాగపట్ల, కల్యాణిడ్యాం పిటిసి, రంగంపేట ప్రాంతాలలో సంచరించే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. పైన తెలిపిన ప్రాంతాలను అలర్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

కోటి సంతకాల సేకరణ ఉద్యమం



ప్రజాశక్తి - నాయుడుపేట: తమ నాయకుడు వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల ఉద్యమం చేపడుతున్నట్టు సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. శనివారం నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిరసిస్తూ వైఎస్ఆర్సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమ పోస్టర్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ పరిశీలకు బీరేంద్ర వర్మ, పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిరుపేద రోగులు, పేద విద్యార్థుల కోసం 17 మెడికల్ కళాశాలలను వైయస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొస్తే అందులో 10 కళాశాల అమ్ముకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. వైఎస్ఆర్సీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు దశలవారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రారంభించామన్నారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి నవంబర్ 22వ తేదీ వరకు రచ్చబండ కార్యక్రమం, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని, అలాగే నవంబర్ 12 వ తారీఖున జిల్లా కేంద్రాలలో ప్రజలు, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యార్థులతో కలిసి భారీ స్థాయిలో ర్యాలీలు నిర్వహిస్తామని, నవంబర్ 24వ తేదీన జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కార్యాలయానికి కోటి సంతకాల పత్రాలు అందజేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైయస్సార్సీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, నాయుడుపేట వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు ఒట్టూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట ఎంపీపీ కొరుగొండ్ల ధనలక్ష్మి, ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, పెళ్లకూరు జడ్పిటిసి సన్నం ప్రిస్కిల్లా, ఆరు మండలాల ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్లు, వైయస్సార్సీపి అనుబంధ విభాగ నాయకులు పాల్గొన్నారు.

వైస్సార్సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్‌కండ్రిగ మండల కేంద్రంలో వైస్సార్సీపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేష్, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి భీరేంద్ర రాజు, అధ్యక్షుడు మణి నాయుడు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, రాష్ట్ర గ్రీవిన్స్ కార్యదర్శి సాయి నాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కో కాన్వీనర్ వేలూరు రాకేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవి జిల్లా క్రియాశీలక అనుబంధ విభాగల నాయకులు వైస్ ఎంపీపీ బాబు రెడ్డి, అజయ్ రెడ్డి జయ చంద్ర నాయుడు పార్టీ యువనేతలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిజిటల్ పరికరాల వాడకంతో కంటి సమస్యలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డిజిటల్ పరికరాల వాడకం వల్ల కంటి సమస్యలు వస్తాయని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు వెంకటాచలం తెలిపారు. స్విమ్స్ ఆప్తమాలజీ (కంటి) విభాగం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి ఆడిటోరియంలో శనివారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభంజన్ కుమార్ మాట్లాడుతూ.... హైదరాబాదుకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ. వెంకటాచలం స్విమ్స్‌కు వచ్చి శ్రీవారి వైద్యసేవ పథకంలో భాగంగా పేషంట్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ (శుక్లాలు), గ్లకోమా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని టిటిడి లోని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఎస్.ఎల్.ఎస్.ఎంపిసి, సొసైటీలలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్, ఆప్తాల్మిక్ సర్జన్ డాక్టర్ ఎ.వెంకటాచలం మాట్లాడుతూ.... డ్రై ఐ– కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ డిజిటల్ పరికరాల వాడకం వల్ల కంటి సమస్యలు వస్తాయని తెలిపారు. కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ (సి.వి.యస్) అనేది డిజిటల్ స్క్రీన్ల వల్ల కలిగే కంటి, దష్టి సంబంధిత సమస్యలు అని, దీనిలో డ్రై ఐ ఒక ముఖ్యమైన లక్షణం, డ్రై ఐ అనేది కళ్ళలో తగినంత కన్నీళ్ళు లేకపోవడం వల్ల వచ్చే ప్రమాదం ఉందని, కంటికి వచ్చే వివిధ రకాల సమస్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్, రిజస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, ఆప్తమాలజీ విభాగపు వైద్యులు, డిప్యూటీ రిజిస్ట్రార్ డా. ఎర్రంరెడ్డి పాల్గొన్నారు.

పచ్చిక మేత బీడులో అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం జి.పాలెం పంచాయతీకి చెందిన కుర్రకాల్వ సర్వే నంబర్ 212లో దాదాపు రెండు ఎకరాల పచ్చిక మేతబీడు ఉంది. ఈ ప్రభుత్వ భూమిలో టిడిపికి చెందిన అనుచరులు అక్రమ కట్టడాలను ఆర్నెళ్ల క్రితం నిర్మించారు. శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో రేణిగుంట తహశీల్దార్ ఆదేశాల మేరకు జేసీబీతో వీటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ రేణిగుంట మండలంలో అక్రమ కట్టడాలు ఇష్టారాజ్యంగా అధికార పార్టీ చోటా నాయకుల చేతివాటంతో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పేదలకు నోటీసులు ఇవ్వకుండా మండల రెవెన్యూ అధికారులు రాత్రిపూట జేసీబీలతో ఇళ్లు కూల్చడం దుర్మార్గమన్నారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుర్రకాల్వ లెక్కదాఖలా సర్వే నంబర్ 213/3, 4, 1లో ఆరు ఎకరాల పచ్చిక మేత బీడు భూమి కబ్జాకు గురైతే రెవెన్యూ అధికారులకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. పేదలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలైలోని అరుణాచలేశ్వరుడి దర్శనానికి, గిరి ప్రదర్శన చేసుకోవడానికి వెళ్తున్న తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన భక్తులపై అక్కడి తమిళులు దాడి చేయడమే కాక, హత్యలు చేయడం తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమేనని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దీనిపై స్పందించకుంటే తిరుపతికి వచ్చే తమిళ భక్తులను అడ్డుకుంటామని పొలిటికల్ అనలిస్ట్ తురగా శ్రీరామ్ హెచ్చరించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి గతంలో ప్రాణాలు సైతం పణంగా పెట్టిన పరిస్థితులు నేడు మళ్లీ ఉద్భవించేలా పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. తిరువన్నామలై కలెక్టర్ అక్కడ ఉన్న బోర్డులలో కేవలం తమిళ భాష మాత్రమే ఉండాలని, బోర్డులపై తెలుగు భాషలో ఉన్న సంకేత సమాచారం పై పెయింటింగ్ చేయించడం, ప్రజా రవాణా బస్సులలో సైతం బోర్డులలో అరుణాచలం అని పేరు ఉండకుండా తీసేయడం వంటివి దేనికి సంకేతం అన్నారు.

ఘనంగా పెన్షనర్స్ రజితోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - పాకాల: పాకాల పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటయి నేటికీ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, అసోసియేషన్ సభ్యులు రజిత సంబరాలు నిర్వహించారు. శనివారం పాకాల బాలికల కళాశాలలో నిర్వహించినా ఈ కార్యక్రమానికి, రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి నుంచి పలువురు అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూల దృష్టితో పరిష్కరించాలని కోరారు.

శనివారం ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి - నాయుడుపేట: తిరవళ్ల శనివారాల్లో 4వ వారాన్ని పుష్కరించుకుని నాయుడుపేట మండలం, విన్నమాలలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో టిడిపి నాయకులు, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి విజయ్ కుమార్ స్వామివారికి పూజలు చేసి అత్తికాయల సుబ్రహ్మణ్యం దంపతులను ఆశీర్వదించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తికాయల ధనుంజయ, సుకన్య, షాజహాన్, బాలకృష్ణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి



ప్రజాశక్తి - క్యాంపస్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా నిర్వహించిన, స్కూల్ గేమ్ సెలక్షన్‌లో ఎస్‌జిఎఫ్ ఆక్స్ఫర్డ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గౌతమి, చైర్మన్ మురళీకృష్ణలు మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లో కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆ విద్యార్థిని అభినందించారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : 2026-27 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా 6, 9వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డా. యన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష ఒయంఆర్ విధానంలో నిర్వహించబడుతుందన్నారు. 6వ తరగతి ప్రవేశానికి 01.04.2014 నుండి 31.03.2016 మధ్య జన్మించిన విద్యార్థులు, 9వ తరగతి ప్రవేశానికి 01.04.2011 నుండి 31.03.2013 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 31 అక్టోబర్ 2025.ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్, మరిన్ని వివరాలకు విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం, వరదరాజనగర్, లేదా ఫోన్: 8688888802 / 9399976999 ను సంప్రదించవచ్చని తెలిపారు.

'ప్రేమిస్తున్నా' చిత్రాన్ని ఆదరించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిన్ననాటి నుండి చైల్డ్ ఆర్టిస్టుగా పలు సినిమాలలో నటించిన తాను యువతను ఎంతో ఆకర్షింపజేసే " ప్రేమిస్తున్నా " చిత్రంలో కథానాయకుడుగా నటించడం జరిగిందని, ఈ చిత్రం నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుందని ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ ఆదరించాలని చిత్ర కథానాయకుడు సాత్విక్ వర్మ విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. దర్శకులు భాను మాట్లాడుతూ ఐబీఎం పతాకంపై రూపొందిన ఈ చిత్రం ప్రతి ఒక్కరిని అలరింప చేస్తుందని, చిత్ర కథానాయకిగా తిరుపతి అమ్మాయి ప్రీతినేహాను ఎంపిక చేసామని, ఇద్దరి జోడు నటన అద్భుతంగా తెరకెక్కించామన్నారు. తిరుమల శ్రీవారి పాదాల చెంత చిత్రంకు సంబంధించిన టీజర్‌ను యూట్యూబ్ ద్వారా రిలీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత కనకదుర్గారావు పాల్గొన్నారు.

పులి సంచారంపై అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలో పులి సంచారంపై వీసీ ఆచార్య నర్సింగరావు విశ్వవిద్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆ పరిసరాల్లో ఆయన పరిశీలించి సెక్యూరిటీ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించే ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు, ఆ ప్రాంతంలో తిరుగే వారికి తెలిసేలా బారికేడ్లను, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.

పేర్నాటిని కలిసిన కస్తూరయ్య

ప్రజాశక్తి -కోట : వైసిపి సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని కోట మండలం, జరుగుమల్లి పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ ఉలసా కస్తూరయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నెల్లూరు, వైసీపీ సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి నివాసంలో జరుగుమల్లి పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు కలవడం జరిగింది. వైసీపీలో నూతనంగా సీఈసి సభ్యులుగా ఎంపికయిన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు కర్లపూడి బుజ్జయ్య, వైసిపి యువ నాయకులు పాల్గొన్నారు.

అండర్-14,17 కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శనివారం శ్రీకాళహస్తి డివిజన్ స్థాయి అండర్-14,17 బాల, బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి హాజరయ్యారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పి కిషోర్ కుమార్ గారి ఆధ్వర్యంలో పోటీలు జరగగా, ఉత్తమ ప్రదర్శన చేసిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్, పిఈటిలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సుజాతకు రజతం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పట్టణానికి చెందిన యోగా మాస్టర్ ఆయిలం సుజాత రజత పతకం సాధించారు. ట్విట్టింగ్ బాడీ విభాగంలో పోటీ పడ్డ సుజాత రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

గరుడ వారధి ప్రమాదంపై ఎమ్మెల్యే నాని విచారం

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి గరుడ వారధి ఫ్లై ఓవర్ మీద జరిగిన రోడ్డు ప్రమాదంపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో చంద్రగిరి మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడం తన మనసును కలచివేసిందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన కుమారుడు పులివర్తి వినీల్ మృతుల దేహాల వద్ద నివాళి అర్పించారు.

కేదార్‌నాథ్ యాత్రలో విషాదం.. తిరుపతి జిల్లా వాసి మృతి


విజయ భాస్కర్ రెడ్డి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన తొట్టంబేడు మండలం, చోడవరం నివాసి శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుమారుడి కథనం మేరకు చోడవరానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా, కుమారుడు హితేష్ రెడ్డి బెంగుళూరు ఎస్‌బిఐలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తండ్రి కోరిక మేరకు కేదార్ నాథ్ యాత్రకు ఈ నెల 3వ తేదీన బయలుదేరారు. మార్గ మధ్యంలో యమునా, ఉత్తరకాశీ, గంగోత్రి దర్శించుకున్నారు. 10వ తేదీన కేదార్‌నాథ్ కొండకు వెళుతుండగా మార్గమధ్యలో విజయ్ భాస్కర్ రెడ్డికి శ్వాస సమస్య ఏర్పడింది. దీంతో తండ్రీ కొడుకులు గౌరీకుండ్‌లోని గదికి చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. అయినా అస్వస్థత పెరగడంతో సోనూ ప్రయాగ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి రుద్ర ప్రయాగ్‌లోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడా మెరుగైన వైద్యం అందక ఉత్తరాఖండ్‌లోని శ్రీనగర్‌కు తరలించే క్రమంలో గుండె పోటుతో మృతి చెందాడు. విజయ భాస్కర్ రెడ్డి మృతదేహాన్ని రుద్ర ప్రయాగ్ నుండి ఢిల్లీ మీదుగా రేణిగుంట విమానాశ్రయానికి కార్గో విమానంలో తరలించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు హితేష్ రెడ్డి తెలిపారు.

ఫర్నిచర్ వితరణ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, పిచ్చినాయుడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి బ్లూమింగ్ బర్డ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఛైర్మన్ హితేంద్ర నాథ్ రెడ్డి ఫర్నిచర్‌ను విరాళంగా అందచేశారు. పంచాయతీ సెక్రటరీ వెంకటరమణ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇన్చార్జి, చంద్రగిరి టిడిపి మండల ట్రెజరీ హరి, చంద్రగిరి టిడిపి 152 బూత్ ఇన్చార్జి, రాజేష్‌లు పాల్గొన్నారు.